క్లుప్తంగా

ఆకట్టుకున్న సర్వ దేవతల సంకీర్తన



పాత గుంటూరు: బృందావన గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళా వేదికపై గురువారం శ్రీ సీతారామాంజనేయ భజన బృందం సర్వదేవతల సంకీర్తనల భజన ఆకట్టుకుంది. పి. చిట్టిబాబు నిర్వహణలో పి. రాంబాబు, వీరయ్య, కె.వీర రాఘవమ్మ, పోతురాజు పలు వేంకటేశ్వరస్వామి భక్తి గీతాల్ని తాళం భజనతో శ్రావ్యంగా ఆలపించారు. ఆలయ సంయుక్త కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు, నూతలపాటి తిరుపతయ్య పాల్గొన్నారు.

నేడు, రేపు తాగునీటి సరఫరాకు అంతరాయం

నెహ్రూనగర్: ఎల్ఎల్ఆర్ (లో లెవెల్ రిజర్వాయర్) పరిధిలో 24, 25 తేదీల్లో తాగునీటి సరఫరాలో అంతరాయం కలుగుతుందని నగర కమిషనర్ కీర్తి చేకూరి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సంగం జాగర్లమూడి నుంచి గుంటూరు నగరానికి తాగునీరు సరఫరా చేసే పైపులైనుపై శలపాడు, శుద్దపల్లి డొంక వద్ద ఏర్పడిన లీకుల వల్ల తాగునీరు తక్కువగా సరఫరా అవుతోందని పేర్కొన్నారు. లీకులకు 25వ తేదీ నాటికి మరమ్మతులు పూర్తి చేసేందుకు అధికారులు కార్యాచరణ సిద్ధం చేశారని తెలిపారు. ఎల్ఎల్ఆర్, ఎల్బీనగర్, బీఆర్ స్టేడియం రిజర్వాయర్ల పరిధిలో కొన్ని ప్రాంతాలకు 24, 25 తేదీల్లో తాగునీటి సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు. 26వ తేదీ నుంచి యథావిధిగా జరుగుతుందని తెలియజేశారు.

మద్యం తాగి ఆటో నడిపితే చర్యలు



గుంటూరు ఈస్ట్: మద్యం తాగి ఆటో నడిపితే చర్యలు తీసుకుంటామని అడిషనల్ ఎస్పీ శ్రీనివాసరావు హెచ్చరించారు. వెస్ట్ ట్రాఫిక్ పోలీసు స్టేషన్‌లో గురువారం ఆటోడ్రైవర్లు, యజమానులకు అవగాహన సదస్సు నిర్వహించారు. అడిషనల్ ఎస్పీ ఎ.శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆటోడ్రైవర్లు తప్పక యూనిఫాం ధరించాలని, విధిగా లైసెన్సులు పొంది ఉండాలని తెలిపారు. ట్రాఫిక్ నిబంధనలు తప్పక పాటించాలని, పరిమితికి మించి ఎక్కువ మందిని ఎక్కించుకునే వారిపై కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. ప్రయాణికులతో మర్యాదపూర్వకంగా మెలగాలని సూచించారు. నేరస్తుల కదలికల్ని పోలీసు అధికారులకు తెలియజేసి సహకరించాలని కోరారు. సమావేశంలో వెస్ట్ ట్రాఫిక్ సీఐ పి.అక్కేశ్వరరావు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

భావితరాల ఆరోగ్యమే లక్ష్యంగా పరిశోధనలు

ఏఎన్‌యూ వీసీ రాజశేఖర్



ఏఎన్‌యూ: భావితరాల ఆరోగ్యమే లక్ష్యంగా పరిశోధనలు జరగాలని వీసీ ఆచార్య పి. రాజశేఖర్ సూచించారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ బోటనీ, మైక్రోబయాలజీ విభాగం ఆధ్వర్యంలో 'మొక్కలు, సూక్ష్మజీవుల పరిశోధనలో సరిహద్దులు' అనే అంశంపై రెండు రోజులపాటు నిర్వహిస్తున్న జాతీయ సదస్సును గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవాళి మనుగడకు, భావి తరాలు వ్యాధుల నుంచి భద్రతను పొందడానికి సూక్ష్మ జీవుల పరిశోధన చాలా అవసరమని తెలిపారు. నైపుణ్యం, ప్రణాళిక మనల్ని కరోనా వైరస్ నుంచి ఎలా కాపాడిందో ప్రత్యక్షంగా చూశామని పేర్కొన్నారు. వ్యాధుల వల్ల దేశాల సరిహద్దులు సైతం మారాయని చెప్పారు. కార్యక్రమంలో త్రిపుర అగర్తలా ప్రభుత్వ ఎల్‌సీడీటీ డైరెక్టర్ వి. ప్రసాదరావు, ఉత్తరప్రదేశ్ లక్నో పరిశోధనా సంస్థ ప్రతినిధి నవీన్ కె. అరోరా, ఏఎన్‌యూ రిజిస్ట్రార్ బి. కరుణ, ఓఎస్‌డీ సునీత, సీడీఈ డైరెక్టర్ బి. నాగరాజు ప్రసంగించారు. పలువురు అధ్యాపకులు, పరిశోధకులు, శాస్త్రవేత్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

జాతీయ సదస్సు బ్రోచర్ ఆవిష్కరణ

ఆచార్య నాగార్జున యూనివర్సిటీ డాక్టర్ వైఎస్సార్ ఇంజనీరింగ్ కళాశాల మెకానికల్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించనున్న జాతీయ సదస్సు బ్రోచర్‌ను గురువారం వీసీ పి. రాజశేఖర్ ఆవిష్కరించారు. సదస్సు కన్వీనర్ ఆర్. విజయ ప్రకాష్ మాట్లాడుతూ 'రీసెంట్ అడ్వాన్సెస్ ఇన్ కాంపోజిట్స్ మెటీరియల్స్' అనే అంశంపై మార్చి 24, 25 తేదీలలో జాతీయ సదస్సు నిర్వహిస్తున్నామని తెలిపారు. పోర్చుగల్ నుంచి ప్రొఫెసర్ పాల్ డార్విమ్, అమెరికా నుంచి మార్క్ జేమ్స్ జాక్సన్ ఆన్‌లైన్ ద్వారా పలు అంశాలపై ప్రసంగిస్తారని తెలిపారు. కార్యక్రమంలో సదస్సు కో- కన్వీనర్ బి. పూర్ణచంద్రారావు, మెకానికల్ విభాగ కో–ఆర్డినేటర్ సీహెచ్. తిరుమలరావు, ఇన్నోవేషన్ సెంటర్ కో–ఆర్డినేటర్ ఎం. గోపీకృష్ణ, ప్లేస్‌మెంట్ సెల్ కో–ఆర్డినేటర్ తాసీఫ్ అహ్మద్ పాల్గొన్నారు.

తాగునీటి ఇక్కట్లకు తెర

- యుద్ధప్రాతిపదికన పైపులైన్ ఇంటర్ కనెక్షన్ పనులు
- నెహ్రూనగర్ వాటర్ ట్యాంకుల నుంచి హెచ్ఎల్ఆర్‌కు కనెక్షన్
- పనులు పూర్తయితే టూ టౌన్‌కి నీటి వృథా అరికట్టడంతో సమృద్ధిగా సరఫరా

నెహ్రూనగర్: నగర శివారు ప్రజల దాహార్తి తీరనుంది. నెహ్రూనగర్ వాటర్ ట్యాంకుల నుంచి హెచ్ఎల్ఆర్ వాటర్ ట్యాంకులకు(పశ్చిమ నియోజకవర్గానికి) తాగునీటిని సరఫరా చేసే 800 ఎంఎం డయా పైపులైనుకు తరుచు లీకులు పడుతుండటంతో సమస్యలు ఎదురవుతున్నాయి. హెచ్ఎల్ఆర్ వాటర్ ట్యాంకులకు సక్రమంగా నీరు అందేది కాదు. దీంతో పశ్చిమ నియోజకవర్గంలో టెయిల్ ఎండ్ పాయింట్‌లో ఉండే కొన్ని వేల మంది ప్రజలు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు నగర కమిషనర్ కీర్తి చేకూరి ప్రత్యేక చొరవ తీసుకున్నారు.

900 ఎంఎం డయా పైపులైన్‌కు అనుసంధానం

నెహ్రూనగర్ వాటర్ ట్యాంకుల నుంచి హెచ్ఎల్ఆర్‌కు గతంలో 800 ఎంఎం డయా పైపులైను మీద తాగునీటి సరఫరా జరిగేది. అయితే, ఈ పురాతన పైపులైను కావడంతో తరుచూ లీకులు ఏర్పడుతూ ఉండేవి.ఇంజినీరింగ్ అధికారులు ప్రతిసారి లక్షలాది రూపాయలు ఖర్చు పెట్టి మరమ్మతులు చేయించేవారు. అయినా ప్రయోజనం ఉండేది కాదు. పంపింగ్ జరిగే సమయంలో ఒత్తిడి పెరిగి తిరిగి లీకులు పడుతూనే ఉండేవి. దీనికి శాశ్వత పరిష్కారం



సంజీవయ్యనగర్ రైల్వే గేటు వద్ద అర్ధరాత్రి సమయంలో కూడా చురుగ్గా సాగుతున్న పనులు

చూపేందుకు గాను రెండేళ్ల కిందట ప్రస్తుతం ఉన్న 800 ఎంఎం డయా పైపులైన్ కాకుండా 900 ఎంఎం డయా పైపులైన్‌ను సంజీవయ్యనగర్, వసంత రాయపురం ట్యాంకులు, జానీ కాలనీ, శ్రీ హాస్పిటల్, డొంక రోడ్డు మెయిన్ రోడ్డు మీదుగా అమరావతి రోడ్డు క్రాస్ చేసుకుంటూ హెచ్ఎల్ఆర్‌కు వేశారు.

హెచ్ఎల్ఆర్‌కు రోజుకు 50 నుంచి 60 ఎంఎల్‌డీ వాటర్ సరఫరా

నెహ్రూనగర్ వాటర్ ట్యాంకుల నుంచి గతంలో హెచ్ఎల్ఆర్ వాటర్ ట్యాంకులకు ప్రతి రోజు 50 నుంచి 60 ఎంఎల్‌డీ (మిలియన్స్ ఆఫ్ లీటర్ పర్ డే) సరఫరా అవుతూ ఉండేవి. ఈ లీకుల వల్ల ప్రతి



పూర్తయిన ఇంటర్ కనెక్షన్

రోజూ 10 ఎంఎల్‌డీ వృథాగా పోయేవి. దీంతో హెచ్ఎల్ఆర్ వాటర్ ట్యాంకుల పరిధిలో టెయిల్ ఎండ్ పాయింట్ (వాటర్ ట్యాంకులకు దూరంగా ఉండే ప్రాంతాలు) ప్రాంతాలైన గుజ్జనగుండ్ల, స్తంభాలగరువు, స్వర్ణాంధ్రనగర్, బుడగ జంగాల కాలనీ, జన్మభూమి నగర్, వికాస్‌నగర్ తదితర ప్రాంతాల్లో నివాసముండే సుమారు 30వేల మందికి తాగునీటి సమస్య వస్తుండేది. ఇంటర్ కనెక్షన్ పనులు పూర్తయితే లీకులు అరికట్టడంతో పాటు టెయిల్ ఎండ్ ప్రాంతాలకు కూడా పుష్కలంగా తాగునీరు అందించవచ్చు.

రాత్రీ, పగలు పనులు

ఇంజినీరింగ్ అధికారులు రేయింబవళ్లు ఇంటర్ కనెక్షన్ ప్రాంతాల వద్దే ఉండి పనుల్ని పర్యవేక్షిస్తున్నారు. రూ.70లక్షలతో ఇంటర్ కనెక్షన్ పనుల్ని రెండు రోజుల్లో పూర్తి చేసేందుకు కార్యాచరణ సిద్ధం చేశారు. 50 మందికి పైగా సిబ్బందితో సంజీవయ్యనగర్, హెచ్ఎల్ఆర్ వద్ద ఇంటర్ కనెక్షన్ పనులు యుద్ధప్రాతిపదికన చేస్తున్నారు. 24వ తేదీ ఉదయం నాటికి యథావిధిగా తాగునీటిని సరఫరా చేసేందుకు చర్యలు తీసుకున్నారు.

వేసవిలో తాగునీటి సమస్య రాకుండా చర్యలు

ప్రస్తుతం ఉన్న 800 ఎంఎం డయా పైపులైన్‌పై తరుచూ లీకులు ఏర్పడుతున్న నేపథ్యంలో కమిషనర్ చొరవతో గతంలో వేసి ఉన్న 900 ఎంఎం డయా పైపులైన్‌కు అనుసంధాన పనుల్ని యుద్ధప్రాతిపదికన చేపట్టాం. ముందుగా ప్రకటించిన రీతిగానే 23వ తేదీ సాయంత్రానికి పనులు పూర్తి చేసి, 24వ తేదీ ఉదయం నుంచి తాగునీటి సరఫరా చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేశాం.

–శాంతి రాజు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్

నర్సింగ్ విద్యార్థినికి ఆర్థిక సాయం



కీర్తికి చెక్కు అందజేస్తున్న వేద సీడ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తులసి ధర్మచరణ్

కొరిటిపాడు(గుంటూరు): పెదకాకాని గ్రామానికి చెందిన నర్సింగ్ విద్యార్థిని ఎద్దనపూడి కీర్తికి మొదటి సంవత్సరం ఫీజు నిమిత్తం రూ.20 వేలను వేద సీడ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తులసి ధర్మచరణ్ స్థానిక అరండల్‌పేటలోని కార్యాలయంలో గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిడుగురాళ్లలోని డాక్టర్ అంజిరెడ్డి కాలేజీ ఆఫ్ నర్సింగ్ కళాశాలలో కీర్తి బీఎస్సీ(నర్సింగ్) మొదటి సంవత్సరం చదువుతోందని పేర్కొన్నారు. ఆమె ఆర్థిక పరిస్థితి బాలేదని, చదువు కొనసాగించడం కష్టమవుతుందని తెలుసుకున్న సిస్టర్ జయరత్నబాల, సిస్టర్ క్లిబస్ తన వద్దకు కీర్తిని తీసుకువచ్చి పరిస్థితిని వివరించారని తెలిపారు. దీంతో ఆమె చదువు పూర్తయ్యే వరకు మొత్తం ఖర్చుల్ని తానే భరిస్తానని హామీ ఇచ్చినట్లు చెప్పారు. కార్యక్రమంలో వేద సీడ్స్ జీఎం గుడి సతీష్‌కుమార్, హెచ్ఆర్ మేనేజర్ తోట రంగారావు, డీజీఎంలు నీలం శివరామకృష్ణ, తేలప్రోలు వెంకట్రావు, పీఆర్ఓ సాయిరాం పాల్గొన్నారు.

వేసవిలో తాగునీటి ఎద్దడి రాకుండా చర్యలు

మేయర్ కావటి

నెహ్రూనగర్: నగరంలో పైప్‌లైన్ మరమ్మతుల్ని యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి తాగునీటిని పునరుద్ధరించాలని మేయర్ కావటి శివ నాగ మనోహర్‌నాయుడు అధికారులకు తెలిపారు. రానున్న వేసవిలో తాగునీటి ఎద్దడి రాకుండా కార్యాచరణ ప్రణాళిక ప్రకారం పనులు నిర్వహించాలని చెప్పారు. నగరంలో హెచ్ఎల్ఆర్ (హై లెవెల్ రిజర్వాయర్), నెహ్రూనగర్ రిజర్వాయర్, సంజీవయ్య నగర్ రైల్వే గేటు వద్ద నిర్వహిస్తున్న తాగునీటి ఇంటర్ కనెక్షన్, పైప్‌లైన్ మరమ్మతు పనుల్ని క్షేత్రస్థాయిలో గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ లీకుల ద్వారా తాగునీరు వృథా కాకుండా హెచ్ఎల్ఆర్ వద్ద, నెహ్రూనగర్ రిజర్వాయర్ వద్ద, సంజీవయ్య నగర్ రైల్వే గేటు వద్ద పైప్ లైన్లకు మరమ్మతులు చేస్తున్నట్లు చెప్పారు.



సంజీవయ్యనగర్ వద్ద ఇంటర్ కనెక్షన్ పనులను పరిశీలిస్తున్న మేయర్ కావటి

కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి గులాం రసూల్, కార్పొరేటర్ పాపతోటి అంబేడ్కర్, నాయకులు అయిశెట్టి శ్రీనివాస్, సాల్మన్ రాజు, అగ్గిపెట్టి రాజు, అంజుమన్ కమిటీ సభ్యులు సలాం, ఈఈ సుందరరామిరెడ్డి, ఇంజినీరింగ్ అధికారులు, సచివాలయాల కార్యదర్శులు పాల్గొన్నారు.

డాక్టర్ నరేంద్రరెడ్డి వైద్య సేవలు మరువలేనివి

ఛత్తీస్‌గఢ్ గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్

గుంటూరు మెడికల్: ఛత్తీస్‌గఢ్ గవర్నర్‌గా గురువారం ప్రమాణ స్వీకారం చేసిన బిశ్వభూషణ్ హరిచందన్‌ను గుంటూరుకు చెందిన సీనియర్ జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జన్, సాయి భాస్కర్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ అధినేత డాక్టర్ బూసిరెడ్డి నరేంద్రరెడ్డి కలసి బొకే అందజేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్‌గా ఉన్నంతకాలం తన కుటుంబానికి డాక్టర్ బూసిరెడ్డి నరేంద్రరెడ్డి అందించిన వైద్య సేవలు ఎన్నటికీ మరువలేమని పేర్కొన్నారు. ప్రధానంగా తమ కుటుంబం కోవిడ్ బారిన పడిన సమయంలో దగ్గరుండి తనను హైదరాబాదు తీసుకువెళ్లి వైద్య సేవలు అందించారని తెలిపారు. తన సతీమణికి



గవర్నర్‌కు పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలియజేస్తున్న డాక్టర్ నరేంద్రరెడ్డి

మోకీలు మార్పిడి శస్త్ర చికిత్స జరిగిన సమయంలో దగ్గరుండి అన్ని వైద్య సేవలు అందించి ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా మామూలు నడక వచ్చేలా చేశారని డాక్టర్ నరేంద్రరెడ్డిని అభినందించారు.

భక్తిశ్రద్ధలతో జీర్ణోద్ధరణ ప్రతిష్ట ఉత్సవాలు

పాత గుంటూరు: నగరంలోని శ్రీ లక్ష్మీనారాయణపురంలో గల శ్రీ లక్ష్మీ నారాయణస్వామి ఆలయ జీర్ణోద్ధరణ ప్రతిష్ట మహోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా గురువారం కర్మాంగ స్నపనం, లజాధివాసం, నయనోన్మీలనం తదితర పూజల్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీ మత్పరమహంస పరివ్రాజకాచార్యులు త్రిదండి చిన్న శ్రీ మన్నారాయణ రామానుజజీయరు స్వామి, శ్రీ త్రిదండి అహోబల రామానుజజీయరుస్వామి, శ్రీ త్రిదండి రామచంద్ర రామానుజ జీయరుస్వామి, శ్రీమాన్ ధనకుధరం సీతారామానుజాచార్యస్వామి పాల్గొన్నారు. అనంతరం విశేష సంఖ్యలో పాల్గొన్న భక్తులకు తీర్థప్రసాదాల్ని అందించారు. కార్యక్రమాన్ని ఆహ్వాన సంఘం సభ్యులు పర్యవేక్షించారు.



మహోత్సవంలో పాల్గొన్న శ్రీ చిన జీయరుస్వామి

నేటి నుంచి ఫార్మసీ అంతర్ కళాశాలల క్రీడాపోటీలు

గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరు, కృష్ణా, ప్రకాశం, బాపట్ల జిల్లాల పరిధిలోని ఫార్మసీ కళాశాలల విద్యార్థులకు శుక్ర, శనివారాల్లో స్పర్ధ పేరుతో క్రీడాపోటీలు నిర్వహిస్తున్నట్లు హిందూ ఫార్మసీ కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు తెలిపారు. అమరావతిరోడ్డులోని కళాశాలలో గురువారం క్రీడాపోటీల పోస్టర్లు విడుదల చేశారు. ఈసందర్భంగా జూపూడి రంగరాజు మాట్లాడుతూ నాలుగు జిల్లాల్లోని ఫార్మసీ కళాశాలల విద్యార్థులకు వాలీబాల్, త్రోబాల్, కబడ్డీ, క్యారమ్స్, చెస్, షార్ట్‌పుట్ పోటీలను నిర్వహించి, విజేతలకు నగదు బహుమతులు, జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందజేస్తామని తెలిపారు. ఏఎన్‌యూ ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జాన్సన్ ముఖ్య అతిథిగా పాల్గొని క్రీడాపోటీలను ప్రారంభించనుండగా, శనివారం జరిగే ముగింపు కార్యక్రమంలో కేంద్ర ఆరోగ్య శాఖ సహాయ మంత్రి డాక్టర్ భారతీ పవార్ బహుమతి ప్రదానం చేస్తారని తెలిపారు. కళాశాల పరిశోధన విభాగ డైరెక్టర్ ఆర్.గోవిందరాజన్, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీ నాగభూషణం, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రవికుమార్, ఫార్మ్.డి డైరెక్టర్ పి.సీతారామయ్య, డాక్టర్ ఏ.సీతాదేవి, పీడీ సీహెచ్ అజిత్‌బాబు పాల్గొన్నారు.



పోస్టర్లు విడుదల చేస్తున్న జూపూడి రంగరాజు, గోవిందరాజన్, నాగభూషణం, రవికుమార్

మృతదేహం అప్పగించాలని కోరుతూ బంధువుల ఆందోళన

గుంటూరు ఈస్ట్: మృతదేహాన్ని అప్పజెప్పాలని కోరుతూ బంధువులు జీజీహెచ్ అత్యవసర విభాగం వద్ద గురువారం ఆందోళన చేశారు. కేవీపీ కాలనీకి చెందిన నల్లబోతుల చెన్నమ్మ (50) అనారోగ్యానికి గురి కావడంతో బంధువులు ఆమెను జీజీహెచ్‌లోని అత్యవసర విభాగానికి గురువారం తీసుకొచ్చారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. అయితే, చెన్నమ్మ అనారోగ్యానికి నాటు మందులు వాడినట్లుగా బంధువులు చెప్పడంతో అనుమానించిన వైద్యులు ఎమ్మెల్సీ (మెడికో లీగల్ కేసు)గా నమోదు చేశారు. మృతదేహాన్ని మార్చురీకి తరలించబోగా మృతురాలి బంధువులు అడ్డుకున్నారు. సెక్యూరిటీ సిబ్బంది, అవుట్‌పోస్ట్ పోలీసులు అడ్డుకోవడంతో కొంతసేపు వాగ్వాదం చోటు చేసుకుంది. చివరకు పోలీసులు మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

షాపులో చోరీ

గుంటూరు ఈస్ట్: షాపులో బంగారు గొలుసు చోరీకి గురైన ఘటనపై లాలాపేట పోలీసులు కేసు నమోదు చేశారు. ఏటుకూరు రోడ్డులో ఎం.అంజమ్మ టీ దుకాణం నిర్వహిస్తోంది. గుర్తు తెలియని వ్యక్తి షాపు వద్దకు వచ్చి మంచి నీరు అడిగాడు. అంజమ్మ లోపలకు వెళ్లి మంచినీరు తెచ్చే సమయానికి సొరుగులో ఉన్న 24 గ్రాముల బంగారు గొలుసు చోరీ చేసి పరారయ్యాడు. బాధితురాలు గురువారం పోలీసులకు ఫిర్యాదు చేసింది.

యువకుడిపై దాడి

ఓ యువకుడిపై ముగ్గురు యువకులు దాడి చేసిన ఘటనపై కొత్తపేట పోలీసులు కేసు నమోదు చేశారు. రామిరెడ్డితోట 4వ లైనుకు చెందిన గాలిమేరి కుమారుడు ప్రేమ్‌కుమార్ ఆడుకునేందుకు 1వ లైనులోకి వెళ్లాడు. అక్కడ షేక్ సుభాని, దేవదాసు, శశి చిన్న విషయమై ప్రేమ్‌కుమార్‌తో గొడవ పడ్డారు. అనంతరం దాడి చేసి కొట్టారు. బాధితుడు ప్రేమ్‌కుమార్ గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

వైద్యుడిపై కేసు నమోదు

రోగిని కులం పేరుతో దూషించిన వైద్యుడు, అతని సిబ్బందిపై పట్టాభిపురం పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. వైద్యుడు కులం పేరుతో దూషించి, దాడి చేశారని బాధితురాలు ధనమ్మ ఫిర్యాదులో పేర్కొంది. ఈ మేరకు హైమా ఆసుపత్రి వైద్యులు డాక్టర్ హనుమంతరావు, సిబ్బందిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రేపు కంటి వైద్య శిబిరం

ప్రత్తిపాడు: రోటరీ క్లబ్ పెదనందిపాడు ఆధ్వర్యంలో పెదకాకాని శంకర కంటి ఆస్పత్రి, జిల్లా అంధత్వ నివారణ సంస్థ సహకారంతో ఈ నెల 25న ప్రత్తిపాడులో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు క్లబ్ అధ్యక్షుడు కె. విక్టర్ పాల్, కార్యదర్శి వై. కె. రామిరెడ్డి తెలిపారు. స్థానిక ఎస్ఆర్ఎస్ రెయిన్‌బో స్కూలు ఆవరణలో ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు శిబిరంలో వైద్య పరీక్షలు జరుగుతాయని చెప్పారు. నేత్ర పరీక్షలు చేయించుకోదలచిన వారు రేషన్, ఆధార్ కార్డు ఫొటోస్టాట్ కాపీలను వెంట తెచ్చుకోవాలని సూచించారు.

ప్రకటనకర్తల నుంచి బకాయిలు వసూలు చేయండి

అధికారులకు కమిషనర్ కీర్తి చేకూరి ఆదేశం

నెహ్రూనగర్: నగరంలో అడ్వర్టైజింగ్ బోర్డులు, హోర్డింగ్‌లు ఏర్పాటు చేసిన ఏజన్సీల నుంచి బకాయిల వసూళ్లకు ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేయాలని సిటీప్లానర్‌ని నగర కమిషనర్ కీర్తి చేకూరి ఆదేశించారు. బకాయిల వసూలుకు ఏసీపీ, టీపీఎస్‌లకు బాధ్యతలు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేయాలని చెప్పారు. నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో గురువారం పట్టణ ప్రణాళిక అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మీడియా డివైజ్ ఫీజుల వసూళ్ల వేగవంతం చేయాలని చెప్పారు. ప్రత్యేక బృందాల ద్వారా స్పెషల్ డ్రైవ్ చేపట్టాలని, ఫీజులు చెల్లించని వారి బోర్డులను తొలగించాలని స్పష్టం చేశారు. బోర్డులకు క్యూఆర్ కోడ్‌తో పాటు జియో ట్యాగ్‌లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ కార్యాలయాలు, పబ్లిక్ ప్రాంతాల్లో పోస్టర్స్ అంటించినా, బ్యానర్స్ కట్టినా పోలీసు కేసు నమోదు చేయడంతో పాటు, భారీ మొత్తంలో అపరాధ రుసుం విధించాలని తెలిపారు. సమావేశంలో సిటీప్లానర్ మూర్తి, డెప్యూటీ సిటీప్లానర్ కోటయ్య, ఏసీపీలు కాలేషా, బాబూరావు, అశోక్ కుమార్, అజయ్ కుమార్, సూపరింటెండెంట్ ప్రసాద్, టీపీఎస్‌లు, సర్వేయర్లు పాల్గొన్నారు.



అధికారులతో సమావేశమైన కమిషనర్ కీర్తి చేకూరి

ఆర్‌వీఆర్‌జేసీలో ఏపీ టీచర్స్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్

గుంటూరు రూరల్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అన్ని కళాశాలల ఉపాధ్యాయులకు పురుషులు, మహిళల విభాగాలలో బ్యాడ్మింటన్ (షటిల్) టోర్నమెంట్ పోటీలను ఈనెల 25, 26వ తేదీలలో నిర్వహించనున్నట్లు ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్.శ్రీనివాస్ తెలిపారు. గురువారం మండలంలోని చౌడవరం గ్రామంలోని కళాశాలలో టోర్నమెంట్ వాల్‌పోస్టర్, బ్రోచర్‌ల ఆవిష్కరణ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ టీచర్స్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ సహకారంతో తమ కళాశాలలో ఈ టోర్నమెంట్ జరుగుతున్నట్లు తెలిపారు. కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ ఆర్.గోపాలకృష్ణ మాట్లాడుతూ నిరంతరం విద్యార్థులకు సేవలందిస్తున్న ఉపాధ్యాయులకు క్రీడల ద్వారా శారీరక, మానసిక ఉత్తేజాన్ని కలిగించేందుకు ఈ క్రీడలు దోహద పడతాయన్నారు. ఈ టోర్నమెంట్‌లో పాల్గొనాలనుకునే అభ్యర్థులు తమ పేర్లను ప్రత్యక్షంగా కానీ లేదా https:// tinyurl. com/ dfrcjvd9 అనే వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చని తెలిపారు.

సంత్ గాడ్గే బాబాకు ఘన నివాళి

నెహ్రూనగర్: బహుజనులు సంత్ గాడ్గే బాబా అడుగుజాడల్లో నడవాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రజక జనసేవ సంఘం ప్రధాన కార్యదర్శి జూపూడి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. రజక జన సేవా సంఘం ఆధ్వర్యంలో సంత్ గాడ్గే బాబా 147వ జయంతి సభను గురువారం కాకుమానువారితోటలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జూపూడి శ్రీనివాసరావు మాట్లాడుతూ సంత్ గాడ్గే బాబా మూఢ నమ్మకాలకు వ్యతిరేకంగా ప్రజల్ని చైతన్యవంతం చేశారన్నారు. ప్రతి ఒక్కరూ పరిశుభ్రంగా ఉండాలని, పిల్లల్ని చదివించుకోవాలని అప్పుడే జీవితంలో ఉన్నత స్థానానికి ఎదుగుతారని పాటలు ద్వారా చైతనవంతుల్ని చేశారని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆయన ఆశయాలను ప్రజల్లో తీసుకెళ్లేందుకు కృషి చేయాలని శ్రీనివాసరావు కోరారు. కార్యక్రమంలో బహుజన నాయకులు జీఆర్ భగత్‌సింగ్, ఉగ్గం సాంబశివరావు, నూతక్కి ఏడుకొండలు, గంటా ప్రభుదాస్, నాయకులు పాల్గొన్నారు.



సంత్ గాడ్గే బాబా చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బహుజన నాయకులు

విధుల్లో నిర్లక్ష్యంగా ఉండే అధికారులపై చర్యలు

- ఎస్టీ కమిషన్ సభ్యుడు వడిత్యా శంకర్‌నాయక్
- గుంటూరులోని పలు హాస్టల్స్ తనిఖీ

నెహ్రూనగర్: గిరిజన సంక్షేమ శాఖ పథకాల్ని క్షేత్ర స్థాయిలో సక్రమంగా అమలు చేయడంలో నిర్లక్ష్యం వహించే అధికారులపై రాష్ట్ర ఎస్టీ కమిషన్ తీవ్రంగా పరిగణించి చర్యలు తీసుకుంటుందని సభ్యుడు వడిత్యా శంకర్ నాయక్ హెచ్చరించారు. ఆయన గురువారం గుంటూరులోని మహిళా ప్రాంగణంలో ఉన్న గిరిజన సంక్షేమ శాఖ కళాశాల బాలికల వసతి గృహం, గిరిజన విద్యార్థుల గురుకుల పాఠశాల వసతి గృహం, కొత్తపేటలోని గిరిజన సంక్షేమ శాఖ కళాశాల విద్యార్థుల వసతి గృహాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. గిరిజన కళాశాల బాలికల వసతి గృహంలో సరైన డ్రైనేజీ, బాత్ రూంలు లేకపోవడం చూసి ఆగ్రహం వ్యక్తం చేశారు. మెనూ ప్రకారం ఆహారం అందిస్తున్నారా..లేదా? అని విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. పలు సమస్యల్ని వారు ఆయన దృష్టికి తెచ్చారు. మెనూ చార్ట్ ప్రకారం ఆహారం అందించడం లేదని వాపోయారు. వసతి గృహం అధికారిణి రమాదేవిని ప్రశ్నించగా సరైన సమాధానం చెప్పకపోవడంతో శంకర్ నాయక్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సమస్యల్ని సాంఘిక సంక్షేమ శాఖ డెప్యూటీ డైరెక్టర్ దృష్టికి ఫోన్ ద్వారా ఫిర్యాదు చేశారు. అనంతరం శంకర్ నాయక్ విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి గిరిజనుల పిల్లలను బాగా చదివించాలని మంచి ఉద్దేశంతో అనేక కార్యక్రమాల్ని అమలు చేస్తున్నారన్నారు. కానీ క్షేత్రస్థాయిలో అధికారులు మాత్రం ఇష్టం వచ్చినట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. కమిషన్ దృష్టికి వచ్చిన సమస్యల్ని కలెక్టర్ దృష్టికి తీసుకు వెళ్లనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో గిరిజన బాలికల గురుకుల పాఠశాల వసతి గృహం సంక్షేమ అధికారి శిల్ప, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ కార్యాలయం సీనియర్ సహాయకులు బాలకోటయ్య, గిరిజన సంక్షేమ సంఘాల నాయకులు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.



కొత్తపేటలోని గిరిజన హాస్టల్‌లో భోజనాన్ని పరిశీలిస్తున్న వడిత్యా శంకర్ నాయక్